కాలువ రేవులు అధ్వానం

రేవుల శుభ్రతను పట్టించుకోని అధికారులు



ఎర్రవంతెన వద్ద చెత్తతో జారిపోయేలా ఉన్న రేవు

పాలకొల్లు సెంట్రల్: మరో నాలుగు రోజుల్లో కార్తీకమాసం పూజలు ప్రారంభంకానున్నాయి. కార్తీకమాసం నెలరోజులు భక్తులు వేకువజామునే లేచి కాలువ రేవులవద్దకు వెళ్లి స్నానాలు ఆచరించి దగ్గర్లో ఉన్న ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకుంటారు. అలాగే ఆ రేవుల్లో కార్తీకదీపాలు వదులుతూ ఉంటారు. అయితే రేవులు అధ్వానంగా ఉండడంతో ఈ నెలరోజులు నిత్యం కాలువ వద్దకు వెళ్లి స్నానం చేయాలంటే భక్తులకు కత్తిమీద సాములాంటిదే. పట్టణంలో ప్రవహించే నరసాపురం–నిడదవోలు ప్రధాన కెనాల్‌కు పట్టణ పరిధిలో సుమారు 18వరకూ రేవులుఉన్నాయి. ఇందులో 5రేవుల మాత్రమే స్నానాలకు అనుకూలంగా ఉంటున్నాయి. మిగిలిన రేవులు కొన్ని బట్టలు ఉతకడానికి మరికొన్ని మలమూత్ర విసర్జనలతో పాటు చెత్త చెదారాలతో దుర్వాసన దారుణంగా ఉంటున్నాయి. ఈ రేవుల వద్ద స్నానాలు చేయాలంటే భక్తులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

బురద, నాచుతో ఇబ్బంది

ఈ రేవుల్లో కాలు వేస్తే బురదలోనే వేసినట్టుగా ఉండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొన్ని రేవుల వద్ద మెట్లు నాచుపట్టి ఉండడంతో స్నానానికి దిగితే కాలుజారీ కాలువలో పడిపోతామనే భయంగా ఉందని వాపోతున్నారు. గతంలో ఇద్దరు మహిళలు దీపాలు వెలిగిస్తుండగా కాలు జారి కాలువలోకి కొట్టుకుపోతుంటే పక్కన ఉన్న మహిళలు వెంటనే స్పందించి వారి చీర చెంగులను పట్టుకుని లాగడంతో నాడు ప్రమాదం తప్పిన సంఘటనలు ఉన్నాయి. ప్రధాన రేవుల వద్ద కింద ఫ్లోరింగ్ చేసి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటుచేసి ఐరన్ రాడ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

దుస్తులు మార్చుకోవడం ఎలా?

రేవుల వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి సరైన వసతులు లేవు. తెల్లవారు జామున చీకట్లో వచ్చే మహిళల కోసం వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రేవుల వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి మొబైల్ టాయిలెట్స్, డ్రెస్సింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. కొందరు రాత్రి సమయాల్లో కాలువ గట్లు, రేవులవద్దే మలమూత్ర విసర్జనలు చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి రేవులను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. ప్రధాన రేవుల వద్ద మునిసిపల్ అధికారులు ఈ నెలరోజులైనా ఎవరూ మలమూత్ర విసర్జనలు చేయకుండా హెచ్చరిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చెత్తతో ఇబ్బంది



అయ్యప్ప దీక్ష చేపట్టిన నాటి నుంచి కాలువలో స్నానం చేస్తున్నా. కానీ రేవుల వద్ద చెత్త చెదారం అత్యంత దారుణంగా ఉండడంతో కాలువలో స్నానం చేయాలంటే భయంగా ఉంటుంది. ఈ కార్తీకమాసంలో స్వాములు, కార్తీకమాసం చేసే భక్తులు అధికంగా స్నానాలకు వస్తుంటారు. అద్వాన్నంగా ఉన్న స్నానాల రేవులను శుభ్రం చేయిస్తే భక్తులకు వెసులుబాటుగా ఉంటుంది. – వి.నవీన్, అయ్యప్ప మాలధారుడు, పాలకొల్లు

అన్ని రేవులనూ అందుబాటులోకి తీసుకురావాలి



కార్తీకమాసంలో కాలువకు స్నానానికి వెళ్లాలంటే దగ్గరగా ఉన్న రేవు చూసుకుంటాం. దగ్గర్లో ఉన్న రేవులు మరీ అధ్వానంగా ఉంటున్నాయి. బాగున్న రేవులు వద్ద లోతు ఎక్కువగా ఉంటుంది. ఎర్రవంతెన వద్ద ఉన్న రేవు భక్తులతో రద్దీగా ఉంటుంది. ఆ పక్కనే ఉన్న రెండు రేవులు అత్యంత అధ్వానంగా ఉంటున్నాయి. అవి కూడా బాగుచేస్తే భక్తుల రద్దీ తగ్గుతుంది. దుస్తులు మార్చుకోవాడానికి మొబైల్ బాత్రూమ్స్, టాయిలెట్స్‌ను కూడా ఏర్పాటు చేయాలి. – వేంద్ర నాగదుర్గ, పాలకొల్లు

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజకిశోర్

మొగల్తూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని తహసీల్దార్ రాజకిశోర్ సూచించారు. మంగళవారం శేరేపాలెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న వంటలను రుచి చూసి మెనూ ప్రకారం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎండీ ఇబ్రహీం, ఆర్‌ఐ నిరంజన్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మొగల్తూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎం నూకరాజు కోరారు. మంగళవారం శేరేపాలెం పంచాయతీ నవుడూరుగరువులో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలలో ఆశించే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన .జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిలకుమారి, జోనల్ కో–ఆర్డినేటర్ అరుణకుమారి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలు సాదన

నరసాపురం: డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.బాలుసాధన సూచించారు. మంగళవారం స్థానిక వైఎన్ కళాశాలలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాలకు చెందిన సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలుసాధన మాట్లాడుతూ ఉచితంగా అందిస్తున్న డీఎస్సీ శిక్షణకు తక్కువ సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అభ్యర్థుల్లో అవగాహన పెంచాలని చెప్పారు. సచివాలయ పరిపాలనా యంత్రాంగంలో ఎక్కడా లోపాలు లేకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు. విద్యార్థుల ఉపకార వేతనాల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ, కళాశాల సామాజిక సేవా సెంటర్ సమన్వయకర్త బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు



కొత్తపాలెంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు: గ్రామంలోని భూసమస్యలు పరిష్కరించేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మండలంలోని కొత్తపాలెంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఉన్న వ్యక్తులు లిఖితపూర్వకంగా తమ భూములకు సంబంధించిన రికార్డులతో వినతిపత్రం అందిస్తే వాటిని పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకం నాగలక్ష్మి, తహసీల్దార్ కె.రాజ కిశోర్, ఎన్‌టీఆర్, లోకం నాని, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: రీ–సర్వే జరిగిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పెనుగొండ తహసీల్దారు జి.అనితకుమారి అన్నారు. మంగళవారం పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని వినతి పత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, డిప్యూటీ తహసీల్దారు టి.రాజేష్ పాల్గొన్నారు.

పీఎంపీ వైద్య సంఘం నుంచి బహిష్కరణ

మొగల్తూరు: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాళీపట్నం గ్రామానికి చెందిన పీఎంపీ వైద్యుడు కటికిరెడ్డి జగన్నాథరావును పీఎంపీ సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేపీఎస్ ముక్తేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస ప్రసాద్‌లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వైద్య సేవలందించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీఎంపీలు, ఆర్‌ఎంపీలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రాథమిక వైద్యం అందించాలని సూచించారు.

వివాహిత మహిళ అదృశ్యంపై కేసు

యలమంచిలి: మండలంలోని బాడవ గ్రామానికి చెందిన కొండేటి రాజేశ్వరి (22) కనిపించడం లేదని ఆమె తల్లి ఉల్లంపర్తి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్లిడి గుర్రయ్య తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 10న తన రాజేశ్వరి ఇంటి నుంచి వెళ్లిపోయిందని, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులను ఆశ్రయించింది. రాజేశ్వరికి భర్తతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కౌన్సిల్ సమావేశాల్లో పట్టణ అభివృద్ధిపై చర్చ సాగాలి

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో వాగ్వివాదానికి దిగిన కౌన్సిలర్లు

నరసాపురం: కౌన్సిల్ సమావేశాల్లో పట్టణ అభివృద్ధిపై చర్చ సాగాలని, అనవసర విషయాలపై సభా సమయాన్ని వృథా చేసుకోవడం వల్ల ఉపయోగం ఉండదని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు వైకేఎస్ సూచించారు. అలాగే పాలనా వ్యవహారాల్లో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా వన్నెంరెడ్డి శ్రీనివాస్ గత సమావేశంలో వాయిదా వేసిన అంశాలను మళ్లీ అజెండాలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. అత్యవసరంగా జరాగాల్సిన పనులపై నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, అధికార వైఎస్సార్‌సీపీ సభ్యులు బొంతు రాజశేఖర్, అడిదల శ్యామల, సర్రి కాంతమ్మలు అన్న క్యాంటీన్ ప్రారంభ సమయంలో చైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్లకు జరిగిన అవమానంపై ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీంతో స్వతంత్ర కౌన్సిలర్ కోటిపల్లి సురేష్, జనసేన కౌన్సిలర్లు సమావేశంలో అల్లరి చేయడానికి యత్నించారు. దీంతో సమావేశం ముందుకు సాగకపోవడంతో వైకేఎస్ కలగజేసుకుని ఇలాంటి అల్లర్ల వల్ల పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఏమైనా ఉపయోగం ఉంటుదా? అని ప్రశ్నించారు. కమిషనర్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తెలియదు, కొత్తగా వచ్చాను అంటూ నిర్లక్ష్యంగా సమాధానాలు ఇవ్వడంపై మండిపడ్డారు. దీంతో వివాదం సర్దుమణిగి సమావేశం కొనసాగింది.

కౌన్సిల్ ఆమోదం పొందినా.. పనులు జరగడంలేదు

కౌన్సిల్ ఆమోదం జరిగిన పనులకు టెండర్లు పిలవడం లేదని, పనులు జరగడంలేదని వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని అధికారులను ప్రశ్నించారు. ఇంతకంటే దౌర్భాగ్యం ఉండదన్నారు. కార్తీకమాసం సమీపిస్తున్నా కూడా వలంధర్‌రేవు వద్ద భక్తుల సౌకర్యార్థం చేయాల్సిన ఏర్పాట్లు చేయడంలేదని ప్రశ్నించారు. తన వార్డులో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే మొదలు పెట్టాలని వన్నెంరెడ్డి కోరారు. నిధులు మంజూరు చేసి, కౌన్సిల్ తీర్మానం చేసినా కూడా మాజీ మున్సిపల్ చైర్మన్ చెరుకూరి లక్ష్మణరావు విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంలేదని కావలి రామసీత ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో మంచినీటి సరఫరా కోసం దాదాపు 30 ఎకరాల భూమిని దానం ఇచ్చిన మహానుభావుడి విగ్రహం మున్సిపల్ కార్యాలయం వద్ద పెట్టుకుందామంటే బాధ్యత లేకుండా వ్యవహరించడం సరికాదన్నారు. పార్కు రోడ్డులో వాటర్‌ట్యాంక్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని, అక్కడ కాపలాపెట్టడానికి శిథిలావస్థలో ఉన్న ట్యాంక్ మరమ్మత్తులకు రూ 5 లక్షలు కేటాయిస్తే ఇప్పటి వరకూ పనులు మొదలు పెట్టలేదని వైఎస్సా ర్‌సీపీ సభ్యుడు సఖినేటిపల్లి సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యుడు పాలూరి బాబ్జి ఇప్పటి వరకూ విపక్ష వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించలేదని అనడంతో చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు ఏ వార్డులకు ఎంత కేటాయించామో? రాతపూర్వకంగా అందజేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేసిందన్నారు. తన వార్డులో పెండింగ్ పనులు చేయడంలేదని వైఎస్సార్ సీపీ పిరాయింపు కౌన్సిలర్ కేసరి గంగరాజు చైర్‌పర్సన్ పోడియం వద్ద కొద్దిసేపు బైఠాయించారు. సభ్యులు బర్రి జయరాజు, వంగా శ్రీకాంత్, మల్లాడి శేషవేణి, చింతా మాలతి, బొమ్మిడి సూర్యకుమారి పలు సమస్యలపై ప్రశ్నించారు. సభ్యులకు కమిషనర్ ఎం.అంజయ్య సమాధానం ఇచ్చారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ బాబు

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు ప్రారంభించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సూచనలు చేసిన అనంతరం కేంద్రాన్ని ప్రారంభించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు అధికారులు ఇస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, తెగుళ్ల నివారణకు ఇచ్చే సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ బాబు కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ మండలం వడలిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారి స్పందన మాట్లాడుతూ తెగుళ్ల ఉధృతి బట్టి తగిన మోతాదులో మాత్రమే పురుగుల మందులు పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి గణేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణపతినీడి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

నత్తారామేశ్వరంలో

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామ సచివాలయం పరిధిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎ.జోష్యుల మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ వరిపంట పూత దశకు చేరుకుందని, రైతులు అవసరం మేరకే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలగల ధర్మారెడ్డి, చంద్రారెడ్డి, గంగిరెడ్డి, కలికిరెడ్డి భైరవుడు పాల్గొన్నారు.

పారిశుధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలోని అన్నివార్డుల్లో పారిశుద్య ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య చెప్పారు. 22వ వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్య పనులు పేరుతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని చెప్పారు. ప్రతిరోజూ డ్రెయిన్స్ శుభ్రం చేసేలా, మురుగునిల్వ ఉండకుండా చూసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిషోర్ ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

యలమంచిలి: విద్యార్థులో నిగూఢంగా ఉన్న ప్రతిభను వెలికితీయడానికి యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని మేడపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా యలమంచిలి మండల శాఖ మంగళవారం మేడపాడు హైస్కూల్లో విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించింది. క్విజ్ పోటీలను మండల శాఖ పూర్వపు ఆఫీసు బేరర్ గణిత నిపుణులు మద్దింశెట్టి శ్రీనివాసరావు పేరిట, వ్యాసరచన పోటీలను మండల శాఖ పూర్వ అధ్యక్షులు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు దామిరెడ్డి జయరామిరెడ్డి పేరు మీద నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ విజేతలకు మండల మహాసభలో బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి పంతం రామమూర్తినాయుడు, గౌరవ అధ్యక్షుడు బి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ

నరసాపురం రూరల్: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న కె.కుమార్ రవితేజ రెడ్డి జేఎన్‌టీయూకే బాస్కెట్‌బాల్ జట్టుకి ఎంపిక అయ్యాడు. సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన టీం విద్యార్థులను పలువురు అభినందించారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కెవి స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ ఎ.గోపిచంద్, పి.పండరీనాథ్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలి

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చేసి దళితవాడల్లోని డ్రెయినేజీలు, రహదారులు అభివృద్ధి చేయాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కందరవల్లిలో మాలమహానాడు సమావేశంలో పాల్గొని మండల ఉపాధ్యక్షుడిగా రావి వెంకటేశ్వరరావు, కందరవల్లి గ్రామ అధ్యక్షుడిగా ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కుక్కల వెంకటేశ్వరరావులను నియమించి, నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో రావి నాగరాజు, చిల్లే సురేష్, అరిగెల పుల్లారావు, ధర్మారావు, ఇంజేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపుకార్డుల అందజేత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలో దాతల సహకారం మరువలేనిదని హెచ్‌ఎం నేతల రాఘవరావు అన్నారు. మంగళవారం స్థానిక పెంకుళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో దాత వంకదార వేణు సహకారంతో విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారన్నారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాళ్ల శ్రీనివాసరావు, సీఆర్‌ఎంటీ బీపీ వినయలత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

పాలకొల్లు అర్బన్: ఆయుర్వేద వైద్య ఆది గురువు ధన్వంతరి మహర్షి జయంతి వేడుకలను మంగళవారం పట్టణంలోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. పాలకొల్లు ప్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ, సాంస్కృతిక కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు కోరుకొండ శేషసుబ్రహ్మణ్య త్రిమూర్తులు (విష్ణు) దంపతులు, ఇలపకుర్తి సూర్యనారాయణ దంపతులను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ర్యాలి విష్ణుమూర్తి, ఉప్పలపు పెద్దిరాజు, దిగమర్తి కాశీ విశ్వనాథం, కంతేటి అన్నవరం, తామరాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.